AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
10-8-2026 (Monday) MAIN EDITION

## కాళేశ్వరం మోటార్లు ఆన్‌చేయాలి : హరీశ్‌రావు



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** కాళేశ్వరం మోటార్లు వెంటనే ఆన్‌చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా రాజకీయలకు అతీతంగా వెంటనే నీటి పంపింగ్ చేయాలన్నారు. ఈ మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి లేఖ రాశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాలోని రిజర్వాయర్లు అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్ లను నింపాలని కోరారు.

## భారత జట్టులోకి సర్ఫరాజ్ ఖాన్..




**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు సర్ఫరాజ్ ఖాన్‌ను ఎంపిక చేశారు. గతంలో ఎంపిక చేసిన జట్టులో అతడు లేడు. అయితే పలువురు ప్లేయర్లు గాయాలతో ఇబ్బంది పడుతుండటంతో సర్ఫరాజ్‌కు అవకాశం వచ్చింది. 2024లో ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో అరంగేట్రం చేసిన సర్ఫరాజ్ ఖాన్.. ఇప్పటి వరకు ఆరు టెస్టులు మాత్రమే ఆడాడు. తాజాగా సాయి సుదర్శన్ గాయపడడంతో శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు ఎంపికయ్యాడు.

## సభను సాగనివ్వండి : స్పీకర్



**అక్షరటుడే, ఢిల్లీ:** లోక్‌సభను సజావుగా సాగనివ్వాలని స్పీకర్ ఓం బిర్లా కోరారు. సోమవారం ఆయన బీఏసీ సమావేశంలో మాట్లాడారు. సభలో నెలకొన్న ప్రతిష్టంభనతో బాధపడిన స్పీకర్, సభా నాయకులకు భావోద్వేగ విజ్ఞప్తి చేశారు. ప్రజల గొంతు వినిపించాలని, ప్రశ్నోత్తరాల సమయం నిర్వహించాలన్నారు.

## నర్సంపేట మెడికల్ కాలేజీకి 'పెద్ది' పేరు



**అక్షరటుడే, వరంగల్:** తాము అధికారంలోకి వచ్చిన తర్వాత.. నర్సంపేటలోని మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పెద్ది సంతాప సభలో ఆయన మాట్లాడారు. వరంగల్‌లో తెలంగాణ ఉద్యమాన్ని ఒంటిచేత్తో నడిపిన గొప్ప నాయకుడు ఆయన అన్నారు.


## 'పాలమూరు-రంగారెడ్డి'పై కేంద్రం కీలక ప్రకటన



**అక్షరటుడే, హైదరాబాద్:** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌పై కేంద్రం కీలక ప్రకటన చేసింది. జాతీయ ప్రాజెక్టు హోదా ఇచ్చే ప్రతిపాదన తమ పరిశీలనలో లేదని వెల్లడించింది. ప్రాజెక్టు టెక్నో ఎకనామిక్ అప్రైజల్‌ను ప్రస్తుతం చేపట్టలేమని పేర్కొంది.

## హోటళ్లలో ఉచిత వైఫైతో డేటా చోరీ

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ప్రపంచవ్యాప్తంగా ప్రయాణాలు చేసేవాళ్లు, హోటళ్లలో వసతి పొందేవాళ్లను టార్గెట్ చేస్తూ భారీ సైబర్ దాడులు జరుగుతున్నాయని మైక్రోసాఫ్ట్ థ్రెట్ ఇంటెలిజెన్స్ బృందం గట్టి హెచ్చరిక జారీ చేసింది. పబ్లిక్ అలాగే హోటళ్ల వైఫై నెట్‌వర్క్‌ల ద్వారా జరుగుతున్న ఈ ఇంటర్నెట్ హైజాకింగ్ దాడికి 'క్యాప్టివ్‌క్రంచ్' అని పేరుపెట్టారు. ఈ ప్రమాదకరమైన హ్యాకింగ్ వెనుక రష్యాకు చెందిన 'మిడ్‌నైట్ బ్లిజార్డ్' అనే హ్యాకింగ్ గ్రూప్ ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఈ సైబర్ దాడులు చాలా ప్రమాదకరంగా మారాయని మైక్రోసాఫ్ట్ తెలిపింది.



## అమిత్ షా ప్రకటన వచ్చే వరకు పార్లమెంట్‌లో డెడ్‌లాక్ వీడదు

**అక్షరటుడే, న్యూఢిల్లీ :** విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యాల ఆరోపణలపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో ప్రకటన చేసే వరకు ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య డెడ్‌లాక్ వీడదని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా స్పష్టం చేశారు. హోంశాఖ మంత్రి స్వయంగా ప్రకటన చేస్తేనే సభ సజావుగా సాగుతుందని ఆమె తేల్చి చెప్పారు. ఈ తరుణంలో తీవ్ర నిరసనల నడుమ మహిళా రిజర్వేషన్, నియోజక వర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), విదేశీ నిధుల క్రమబద్ధీకరణ సవరణ చట్టం వంటి కీలక బిల్లుల భవితవ్యం అనిశ్చితిలో పడింది.

**జార్ఖండ్‌లో విద్యార్థుల ర్యాలీ ఉద్రిక్తంగా మారింది. పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా విద్యార్థులు, నిరుద్యోగులు సోమవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. వేలాది మంది విద్యార్థులు తరలి వచ్చారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. బారికేడ్లు అడ్డుపెట్టారు. ఈ క్రమంలో విద్యార్థులు బారికేడ్లను తోసుకుంటూ వెళ్లడానికి యత్నించగా.. పోలీసులు లాఠీఛార్జి చేశారు. విద్యార్థులపై వాటర్ కేనాన్లు ప్రయోగించారు.** - అక్షరటుడే, నేషనల్ డెస్క్



# జార్ఖండ్‌లో హైటెన్షన్

- ఉద్రిక్తంగా మారిన అసెంబ్లీ ముట్టడి
- భారీగా తరలి వచ్చిన విద్యార్థులు
- అడ్డుకున్న పోలీసులు
- విద్యార్థులపై లాఠీఛార్జీ

జార్ఖండ్ జీపీఎస్సీ-జేఎస్ఎస్‌సీ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని విద్యార్థులు, నిరుద్యోగులు కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఆందోళనల్లో భాగంగా సోమవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా యువత తరలి వచ్చారు. విద్యార్థి నాయకుడు దేవేంద్రనాథ్ మహతో మాట్లాడుతూ.. నిరాహార దీక్షలో ఉన్నప్పటికీ తాను ఇక్కడికి వచ్చానని తెలిపారు. వారు తమను అడ్డుకోలేరన్నారు. "నేను అంబులెన్స్‌లో ఇక్కడికి చేరుకున్నాను, ఇప్పుడు స్ట్రెచర్‌పై ముందుకు సాగుతున్నాను. గత 9 రోజులుగా నేను నిరాహార దీక్ష చేస్తున్నాను, ప్రభుత్వం మా డిమాండ్లను అంగీకరించక తప్పదు." అన్నారు.

### అడ్డుకున్న పోలీసులు

విద్యార్థులు పోలీసుల బారికేడ్ల వద్దకు చేరుకున్నారు. అక్కడ పోలీసులు విద్యార్థులను అడ్డుకున్నారు. దీంతో వారు బారికేడ్లపైకి ఎక్కి నిరసన తెలిపారు. ఈ క్రమంలో తోపులాట చోటు చేసుకుంది. విద్యార్థులు మాట్లాడుతూ.. తాము శాంతియుతంగా విధానసభ వైపు వెళ్తుంటే పోలీసులు అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చేవరకు ఆందోళనలు విరమించే ప్రసక్తే లేదని తెలిపారు. పరీక్షను రద్దు చేయాలని, దీనిపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

### ఎక్కడికక్కడ తనిఖీలు

అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో జార్ఖండ్ పోలీసులు ఎక్కడికక్కడ విద్యార్థులను అడ్డుకున్నారు. రాంచీకి వచ్చే మార్గాల్లో తనిఖీలు చేశారు. బస్సులను ఆపి వేశారు. విద్యార్థులు ఇక్కడికి చేరుకోకుండా ఉండేందుకు బైక్‌లను కూడా క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రాంచీలో పోలీసులు లాఠీఛార్జ్ చేసి, వాటర్ కెనాన్లను ఉపయోగించారు. దేశంలోని అన్ని సమస్యలను లాఠీలతో కాకుండా చర్చలతోనే పరిష్కరించగలమని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ చెప్పినప్పటికీ ఈ ఘటన చోటుచేసుకుంది. విద్యార్థి నాయకుడు దేవేంద్ర మహతో, పోలీసులు అడ్డుకుంటే వారితో వాదించవద్దని, క్రమశిక్షణతో అసెంబ్లీకి చేరుకోవడానికి కొత్త మార్గాలను వెతుక్కోవాలని నిరసనకారులకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రదర్శనలో పాల్గొనేందుకు వేలాది మంది విద్యార్థులు ఈ ఉదయం పలు జిల్లాల నుంచి రైళ్లు, బస్సులు, ఇతర వాహనాల్లో భారీ సంఖ్యలో రాష్ట్ర రాజధానికి చేరుకున్నారు.

### బీజేపీ నిరసన


ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ నివాసం ఎదుట బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలని విద్యార్థులు పట్టుబట్టడంతో, నిన్న జరిగిన ఆరో దఫా చర్చలు కూడా ఎలాంటి పరిష్కారాన్ని ఇవ్వలేదు.

## లవ్లీనా బాధ్యత అభినందనీయం: ప్రధాని మోదీ



**అక్షరటుడే, ఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలు సాధించిన అథ్లెట్లు ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. వారితో సరదాగా ముచ్చటించిన ప్రధాని, అథ్లెట్లకు లడ్డూలు తినిపించి అభినందించారు. ముఖ్యంగా బాక్సర్ లవ్లీనా బోర్గోహైన్ గ్లాస్‌గోలో చేసిన సాహసాన్ని ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆమె చేసిన పని చాలా గొప్పదని, దేశమంతా దానిని సుదీర్ఘకాలం గుర్తుపెట్టుకుంటుందని కొనియాడారు. గ్లాస్‌గోలోని ఓ రెస్టారెంట్‌కు లవ్లీనాతో పాటు మరికొందరు భారత అథ్లెట్లు డిన్నర్‌కు వెళ్లారు. అక్కడ ఉన్న హ్యాండ్ టవల్స్ (నాప్‌కిన్స్)పై భారత మ్యాప్ అసంపూర్తిగా ముద్రించి ఉండటాన్ని లవ్లీనా గమనించారు. సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని బయటపెట్టడంతో, సదరు రెస్టారెంట్ దిద్దుబాటు చర్యలు చేపట్టి క్షమాపణలు తెలిపింది.

## ఇరాన్‌తో యుద్ధానికి ఫుల్‌స్టాప్ పెట్టనున్న ట్రంప్!




**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** ఇరాన్, అమెరికా మధ్య నెలల తరబడి కొనసాగుతున్న యుద్ధం ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ సంచలన నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నట్లు ప్రముఖ అంతర్జాతీయ వార్తా సంస్థ 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' తెలిపింది. ఇరాన్‌తో పూర్తిస్థాయి కొత్త అణు ఒప్పందం కుదరకపోయినా, యుద్ధాన్ని ముగించేందుకు ట్రంప్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇందుకోసం హోర్ముజ్ జలసంధిని పూర్తిగా పునః ప్రారంభిస్తే చాలు అనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ జలసంధి ద్వారా అంతర్జాతీయ నౌకాయానాన్ని పునరుద్ధరించడమే ప్రాతిపదికగా.. సైనిక దాడిని నిలిపివేసి, కాల్పుల విరమణను పొడిగించేందుకు ట్రంప్ సుముఖంగా ఉన్నట్లు అమెరికా అధికారులు వెల్లడించినట్లు ఈ కథనం పేర్కొంది.

## పంజాబ్‌లో ఎన్‌కౌంటర్..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** పంజాబ్‌లో ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు గ్యాంగ్‌స్టర్లు గాయపడ్డారు. ఫిరోజ్‌పూర్ జిల్లా మల్లన్‌వాలా ప్రాంతంలో పోలీసులతో జరిగిన కాల్పుల ఘటనలో వసూళ్ల కేసులకు సంబంధం ఉన్న ఇద్దరు గ్యాంగ్‌స్టర్లు గాయపడి అరెస్టు అయ్యారని అధికారులు తెలిపారు. పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను ఆపడానికి ప్రయత్నించారు. అయితే నిందితులు ఆగకుండా పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని అడ్డుకోగా కాల్పులు జరిపారు. దీంతో పోలీసులు ఎదురు కాల్పులు జరిపారు.



## గుప్త నిధుల పేరుతో మోసాలు.. నలుగురి అరెస్ట్

**అక్షరటుడే, రంగారెడ్డి :** గుప్త నిధుల పేరిట ప్రజలను మోసం చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. రాజేంద్రనగర్ పోలీసుల సహకారంతో శంషాబాద్ జోన్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ ముఠాను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 2 కార్లు, ఒక ఆటో, రెండు బైక్‌లు. 4 సెల్‌ఫోన్లు, 25 నకిలీ బంగారు పూత నాణేలు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో మహ్మద్ మునావర్ అలియాస్ మున్నా (36), సయ్యద్ అలీ అష్రఫ్ (40), మహ్మద్ హాజీ (25), మహ్మద్ సల్మాన్ (29) ఉన్నారు. ప్రధాన నిందితుడు మునావర్ తనకు గుప్త నిధులు వెలికితీసే విద్య తెలుసని ప్రజలను నమ్మించేవాడు. అనంతరం వారి నుంచి డబ్బులు వసూలు చేసేవాడు. ఇలా 11 మందిని మోసం చేసి వారి నుంచి రూ.కోటి వరకు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు.




## జార్ఖండ్ పరీక్షల్లో అక్రమాలపై ఈడీ కేసు నమోదు




**అక్షరటుడే, వెబ్‌డెస్క్ :** జార్ఖండ్ జీపీఎస్సీ పరీక్ష అక్రమాలపై ఈడీ కేసు నమోదు చేసింది. పరీక్షల్లో అక్రమాలు జరిగాయని విద్యార్థులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. దీనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణను చేపట్టింది. సీఐడీ నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ ఒక ECIRను నమోదు చేసింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి తదుపరి చర్యలు ప్రారంభించింది. పరీక్షల అక్రమాలకు సంబంధించి భారీ స్థాయిలో ఆర్థిక లావాదేవీలు జరిగి ఉండవచ్చని అనుమానిస్తోంది.

## వైద్యం వికటించి విద్యార్థిని మృతి

**అక్షరటుడే, ఖమ్మం :** ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం బస్వాపురంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. వైద్యం వికటించడంతో ఓ విద్యార్థిని ప్రాణాలు కోల్పోయింది. బస్వాపురానికి చెందిన చల్లా రమేష్-మౌనిక దంపతుల కుమార్తె హేమశ్రీ (14) 8వ తరగతి చదువుతోంది. ఆదివారం జలుబు, జ్వరంతో అస్వస్థతకు గురైన బాలికను తల్లిదండ్రులు స్థానికంగా ఆర్ఎంపీ సంపత్ వద్దకు తీసుకెళ్లారు. వైద్యుడు బాలిక చేతికి క్యాన్లా ఏర్పాటు చేసి ఇంజెక్షన్ ఇవ్వగానే, ఆమెకు ఒక్కసారిగా శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది తలెత్తింది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే హేమశ్రీ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

## ఫ్యూచర్ సిటీ పేరుతో భూ దోపిడీ : మన్నె క్రిశాంక్

**అక్షరటుడే, హైదరాబాద్ :** ఫ్యూచర్ సిటీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం భూ దోపిడీకి పాల్పడుతోందని బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. నల్లధనాన్ని విదేశాలకు తరలించే కుట్ర జరుగుతోందన్నారు. షెల్ కంపెనీ పేరుతో భూములు కేటాయించుకున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి సోదరుడు అనుముల కొండల్ రెడ్డికి చెందిన టెస్సెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీపై క్రిశాంక్ ఆరోపణలు చేశారు. ఈ కంపెనీ కేవలం రూ. లక్షతో మొదలైందన్నారు. ఈ కంపెనీ ఏమీ మ్యానుఫ్యాక్చరింగ్ చేయకపోయినా రూ. కోటి ఫారిన్ ఎక్స్ఛేంజ్ ఎర్నింగ్స్ వచ్చాయని ఆరోపించారు.

